సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖ విమానాశ్రయంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జగనన్న అమ్మ ఒడి పథకం ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన ఆయన విశాఖలో ట్రాన్సిట్ హాల్ట్ చేశారు. – డాబాగార్డెన్స్

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి వివరాలు 8985515989 కు వాట్సప్ చేయాలి.

ఉపాధి కల్పనకు ఉచిత శిక్షణ

మురళీనగర్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్) లో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెమ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గోపీకృష్ణ శివం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ పథకంలో భాగంగా 18–26 సంవత్సరాల యువతకు ఉచిత వసతీ సౌకర్యాలతో ఉపాధి శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి, ఐటీఐలో వెల్డర్, ఫిట్టర్, టర్నర్, సీవోపీఏ, మెషినిస్ట్, మెకానికల్ డిప్లమో, డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి వెల్డింగ్ టెక్నాలజీ, లాజిస్టిక్స్ సెక్టార్‌లోని వేర్‌హౌస్ సూపర్‌వైజర్ కోర్సులు, సీఎన్‌సీ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచితంగా భోజన వసతి కల్పిస్తూ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు సింధియా కూడలిలోని సెమ్స్ కార్యాలయానికి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 77948 40934, 85006 87750 లేదా 0891–2704010 ఫోన్ నంబర్లలో జూలై 5వ తేదీలోగా సంప్రదించాలన్నారు. శిక్షణ తరగతులు జూలై10 నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్)తెలిపారు. డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ కార్ప్, హెటిరో డ్రగ్స్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, డక్కన్ ఫైన్ కెమికల్స్, పేటీఎం, సువర్ణభూమి డెవలపర్స్, అపోలో ఫార్మసీ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల్లో 375 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ప్రాసెస్ అసోసియేట్, కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ప్రతినిధి, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, టెలీకాలింగ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గోడౌన్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించి 18–27 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https:// www. ncs.gov.in/ లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని వారు కోరారు.

శ్రీకృష్ణావతారంలో జగన్నాథుడు

- నేడు శేషపాన్పుపై స్వామి దర్శనం
- రేపు బహుదా యాత్ర

డాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీ వద్ద సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కొలువుదీరిన జగన్నాథ స్వామి బుధవారం బలరామ, శ్రీ కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున 5 గంటలకు మేల్కొలుపు అనంతరం ప్రత్యేక పూజలు, పారాయణాలు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు విష్ణుసహస్రనామ పారాయణ, గోవిందనామ సంకీర్తన, హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించారు. చందన డ్యాన్స్ అకాడమీచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా దశవతారాల్లో చివరి రోజైన గురువారం స్వామి శేషపాన్పుపై దర్శనమివ్వనున్నారు. సాయంత్రం శ్రీశ్రీ మ్యూజిక్ వారి బాలలీలామృతం, శ్రీహరి సంకీర్తన సంస్థచే అన్నమయ్య గీతాంజలి ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు.

రేపు తిరుగు రథయాత్ర

ఈ నెల 30న స్వామి బహుదాయాత్ర నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 10.05 గంటలకు స్వామిని రథంపై కొలువుదీర్చుతారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ చౌల్ట్రీ కల్యాణమండపం నుంచి బాణసంచా, మంగళవాయిద్యాల నడుమ ప్రారంభమయ్యే తిరుగు రథయాత్ర కొత్తరోడ్డులో ఉన్న స్వామి ఆలయం వరకు నిర్వహించనున్నారు. జూలై ఒకటి ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామి యథాస్థానంలోకి వెళ్లనున్నారు.

13న మహాన్నదానం

జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 13న మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వామి ఆలయ ప్రాంగణంలో వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, ఏపీఈడబ్ల్యూడీసీ చైర్మన్ మళ్ల విజయప్రసాద్, అరుణకుమారి దంపతుల సహకారంతో పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నారు.



బలభద్రుడు, సోదరి సుభద్రతో బలరామ.. శ్రీకృష్ణావతారంలో జగన్నాథుడు



జగన్నాథుడి బహుదా యాత్రలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా శోభాయాత్ర

బీచ్ రోడ్డు: ఉత్కల్ సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం జగన్నాథుడి బహుదా శోభాయాత్ర కనుల పండువగా సాగింది. లాసన్స్ బే కాలనీలో ప్రారంభమైన ఈ యాత్ర వుడా పార్కు, చినవాల్తేరు, ఏయూ గేటు, సిరిపురం మీదుగా దసపల్లాహిల్స్‌లోని జగన్నాథ స్వామీ ఆలయానికి చేరుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఉత్కల్ సమాజ్ అధ్యక్షుడు నాయక్ మాట్లాడుతూ 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్రలు తిరిగి తమ ఇంటికి చేరుకున్నారన్నారు.

14న జోన్-5లోని దుకాణాలు, మండపాలకు వేలం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–5 పరిధిలోని 40 నుంచి 60 వార్డుల్లో ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్‌సైడ్ మార్కెట్లకు జూలై 14న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో వేలంపాట జరుగుతుందన్నారు. 60వ వార్డు గుల్లలపాలెం వాణిజ్య సముదాయంలోని 8, 16, 26, 48, 55, 56, 58 నంబర్ల దుకాణాలు.. సుబ్బలక్ష్మీనగర్ వాణిజ్య సముదాయంలోని 3, 4, 5, 7, 8, 9, 10, 13, 14 నంబర్ల దుకాణాలు.. నరవ రోడ్డు వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 2.. సంజీవయ్య కాలనీ వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 1, 2.. ములగాడ వాణిజ్య సముదాయంలోని 4, 5 దుకాణాలు, అశోక్‌నగర్ వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 3.. 44వ వార్డులోని షాదీఖానా(కల్యాణ మండపం), 51వ వార్డులోని మాధవ స్వామి కల్యాణ మండపం(మూడేళ్ల కాల పరిమితికి), గొల్లలపాలెం, పల్లివీధి రోడ్డు, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం సైడ్ మార్కెట్లు, జనతా కాలనీ మార్కెట్‌కు(ఏడాది కాలానికి) వేలం వేస్తామని చెప్పారు. దీనిలో పాల్గొనే వారు ధరావత్తు మొత్తం డీడీ రూపంలో చెల్లించాలని, ఎస్సీ రిజర్వ్ కేటగిరీ వారు తహసీల్దార్ జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం అందజేయాల్సి ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆధార్, పాన్ కార్డులు అందించాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల వారు వివరాలకు జోన్–5 కార్యాలయంలో పనిదినాల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని జెడ్సీ కోరారు.

ఆది వారాహి అవతారంలో అమ్మవారి దర్శనం

- ముగిసిన వారాహి నవరాత్రులు

అల్లిపురం: బంగారుమెట్ట షిరిడీ సాయి దర్బార్‌లోని అనఘాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో వారాహి నవరాత్రులు బుధవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆషాడ శుద్ధ దశమి సందర్భంగా ఆలయంలో వారాహి అమ్మవారు ఆది వారాహిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. అల్లిపురానికి చెందిన మురళి, మీనా దంపతులు బహూకరించిన వెండికవచాన్ని అమ్మవారికి అలంకరించారు. అమ్మవారికి మహా నైవేద్యాన్ని నివేదించి, పంచహారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



వెండి కవచంలో ఆది వారాహిదేవిగా అమ్మవారు

అందరి సహకారంతో ప్రేమసమాజం అభివృద్ధి

నూతన అధ్యక్షుడు బుద్ధ శివాజీ

డాబాగార్డెన్స్: అందరి సహకారంతో ప్రేమ సమాజం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు బుద్ధ శివాజీ పేర్కొన్నారు. ప్రేమసమాజం నూతన కమిటీ బుధవారం ప్రేమసమాజంలో పదవీ బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా బుద్ధ శివాజీ మాట్లాడుతూ ప్రేమ సమాజం 93వ సంవత్సరంలోకి అడుగు పెడుతోందని, తాను ఉపాధ్యక్షుడిగా సేవలందించానని, ఇప్పుడు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఇది పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారందరూ ప్రేమసమాజం అభివృద్ధికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రేమసమాజంలో నిరాశ్రయులు, అనాథలు 300 మంది వరకు ఉన్నారని, కోవిడ్ సమయంలో ఏ ఒక్కరూ చనిపోకుండా చూసుకున్నామని, అది ప్రేమ సమాజం గొప్పతనంగా పేర్కొన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా గోశాల నిర్వహణ చేపడుతున్నామన్నారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షునిగా మట్టపల్లి హనుమంతరావు, కేశప్రగడ నరసింహామూర్తి, గౌరవ కార్యదర్శిగా కె.హరిమోహన రావు, గౌరవ కోశాధికారిగా ఎంవీవీకే గుప్తా, సంయుక్త కార్యదర్శులుగా వి.మోహన్‌రావు, వి.కె.సురేష్‌కుమార్, ఎస్.గౌరీ ప్రసాదరావు పలువురు సభ్యులచే ప్రముఖ వైద్యుడు విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించి, నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రేమసమాజం పూర్వ అధ్యక్షుడు కంచర్ల రామబ్రహ్మం, వేగి సత్యనారాయణ, ఉప్పల భాస్కరరావు, బొడ్డేటి తాతారావు, ఎస్.అప్పలరాజు, శరగడం సత్యనారాయణ, వైఎస్ జగన్, డాక్టర్ బీఎం నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ

బుద్ధ శివాజీకి అభినందనలు

డాబాగార్డెన్స్: ప్రేమసమాజం కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితుడైన కేంద్ర గౌరీ గవర సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీకి ఆ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ, పీసీసీ సభ్యుడు వైఎస్ జగన్నాథరావు అభినందనలు తెలిపారు. బుధవారం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.

ఉత్తరాఖండ్ సీఎంకు చాతుర్మాస దీక్షకు ఆహ్వానం

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి బుధవారం ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామితో భేటీ అయ్యారు. వచ్చేనెల 3న రుషికేష్‌లో ప్రారంభించనున్న చాతుర్మాస దీక్షపై చర్చించారు. విశాఖ శ్రీశారదాపీఠం రిషికేష్ ఆశ్రమాన్ని సందర్శించాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున దీక్షకు ఎలాంటి సహకారమైనా అందిస్తామని స్వాత్మానందేంద్ర స్వామికి హామీ ఇచ్చారు.

ఆశా కార్యకర్తల పాత్ర కీలకం

మహారాణిపేట: మాతా, శిశు సంరక్షణ చర్యల్లో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాతృ, శిశు మరణాలు సంభవించకుండా మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ప్రతి ఆశా కార్యకర్త సచివాలయాల పరిధిలోని గృహాలను సందర్శించి కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల డీడీల అందజేత

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో గత ప్రభుత్వంలో టిడ్కో గృహాల కోసం డీడీలు చెల్లించి ఇళ్లు మంజూరు కాని వారికి చెక్కుల రూపంలో తిరిగి వాటిని అందించారు. జ్ఞానాపురం జోన్–5 సచివాలయం బిషప్ కె.మరియదాస్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో లబ్ధిదారులకు డీడీలను కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీడీలు కట్టి ఇళ్లు రాని లబ్ధిదారులు వడ్డీ చెల్లించ లేక సతమతమయ్యే వారిని దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారిని ఉపశమనం కలిగించేలా చెక్కులు అందిస్తున్నారన్నారు. త్వరలో వారికి సెంటు భూమి వచ్చేలా కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వార్డు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, జీవీఎంసీ సీవో శివ, ఆర్పీలు భవాని, లూర్దు, కృష్ణవేణి, జయ, పద్మ, నాయకులు వెళంగిణిరావు, శివ, కుమార్, శ్రీను, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



డీడీలు అందిస్తున్న సీవో శివ, కోడిగుడ్ల శ్రీధర్

జగన్నాథుడి ఉత్సవాల్లో ప్రసాదం పంపిణీ

డాబాగార్డెన్స్: జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా టర్నర్ చౌల్ట్రీలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. న్యాయవాదులు ఎంకే శ్రీనివాస్, ఎంకే వేంకటేష్ ఉచిత ప్రసాద పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు నల్లూరి నూకరాజు, కార్యదర్శి పూసర్ల సురేష్‌కుమార్, కార్యక్రమ చైర్మన్ కందుల సురేష్, కోశాధికారి గ్రంధి దుర్గాప్రసాద్, కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, సభ్యులు సుగ్గు శివకుమార్, కేవీ రమణయ్య, పూసర్ల సంజీవరావు, కంకటాల సతీష్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాదం అందిస్తున్న ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులు

ప్రధాని మోదీ పాలనపై ప్రచారం



కురుపాం మార్కెట్ ఏరియాలో స్థానికులకు కరపత్రాలు అందజేస్తున్న మేడపాటి రవీంద్ర

జగదాంబ: గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కురుపాం మార్కెట్ ఏరియాలో పర్యటించారు. స్థానికులను కలిసి ప్రధాని నరేంద్ర మోదీ తన తొమ్మిదేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గురించి వివరించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఫిషింగ్ హార్బర్ మండల అధ్యక్షుడు వాసుపల్లి రామారావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత రాజ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పల్లి శ్రీనివాసులు నాయుడు, కొండ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరిహారం అందజేత

అల్లిపురం: వడదెబ్బతో మృతి చెందిన సెక్యూరిటీ గార్డు కుటుంబానికి కార్పొరేటర్ సాధిక్ చేతుల మీదుగా బుధవారం పరిహారం అందజేశారు. వివరాలివి.. 34వ వార్డు కొబ్బరితోట ప్రాంతానికి చెందిన దేవరపల్లి పరదేశి (56) ఇటీవల వడదెబ్బతో మృతి చెందారు. అతనికి బీమా కూడా లేదు. దీంతో కార్పొరేటర్ సాధిక్ మృతుడు పనిచేస్తున్న కంపెనీ యాజమాన్యంతో మాట్లాడటంతో లక్ష రూపాయలు పరిహారం, మృతుని భార్య దేవరపల్లి పద్మకు ఉద్యోగం ఇచ్చేలా ఒప్పుకుంది. ఈ మేరకు కంపెనీ యాజమాన్యం అందించిన లక్ష రూపాయల పరిహారం చెక్కును కార్పొరేటర్ సాధిక్ మృతుని భార్యకు అందించారు. ఆయన వెంట గాలి పార్వతి, కుమార్ పాల్గొన్నారు.



మృతుని భార్య పద్మకు చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ సాధిక్ తదితరులు

శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాల సందర్శన

మద్రిపాలెం: ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న శిశుగృహ, ఐసీడీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ వెంకటేశ్వరి సందర్శించారు. శిశుగృహలో పలు దస్త్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఇటీవలే నూతనంగా ఏర్పడిన సెక్టార్ విధివిధానాలను వారు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిర్వహించిన ప్రాజెక్ట్ సమావేశంలో అంగన్‌వాడీ సిబ్బంది పలు సూచనలిచ్చారు. అధికారుల వెంట అడిషనల్ సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు కుమారి, వెనిష తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ కళాశాలల అక్రమాలపై ఆర్‌ఐవోకు ఫిర్యాదు

మద్దిలపాలెం: ప్రైవేట్ జూనియర్ కళాశాలల అక్రమాలను అరికట్టాలని కోరుతూ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మద్రివేముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పిఠాపురం కాలనీలోని ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌ఐవోకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం కింద ప్రతి 100 సీట్లలో 25 సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ఉచితంగా కేటాయించాలని నిబంధన ఉందన్నారు. అయినా పట్టించుకోకుండా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఇరుకు గదుల్లో తరగతులు, సరైన మరుగుదొడ్లు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా కళాశాలలు నడుపుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా కళాశాలల్లో పుస్తకాలు, యూనిఫారం పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా శాఖ అధ్యక్షుడు పెద్దాడ గిరిధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సూర్యం పాల్గొన్నారు.



ఆర్‌ఐవోకు ఫిర్యాదు అందిస్తున్న మద్రివేముల శ్రీనివాస్

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్

అల్లిపురం: భర్తను హత్య చేసిన భార్యను మహారాణిపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ప్రకాష్‌రావుపేటలో చిత్తూరు రమణారావు, తన భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలసి జీవిస్తున్నారు. రమణారావు నిత్యం మద్యం సేవించి.. భార్యను హింసించేవాడు. మూడు రోజుల కిందట రమణారావు భోజనం చేస్తున్న మద్యం మత్తులో భార్యతో గొడవపడి.. ఆమెను చంపేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె అందుబాటులోని సెల్ చార్జర్ వైరును అతని మెడకు గట్టిగా చుట్టడంతో రమణారావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అంత్యక్రియలు చేసేందుకు చావులమదుం శ్మశానవాటికకు తీసుకువెళ్లారు. అక్కడ అతని మృతిపై అనుమానం వచ్చిన బంధువులు మహారాణిపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించడంతో విషయం బయట పడింది. దీంతో హత్య కేసుగా నమోదు చేసి విచారణ జరిపారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సంపత్ వినాయకుని హుండీల ఆదాయం లెక్కింపు

సీతమ్మధార: ఆశీలమెట్టలో కొలువైన సంపత్ వినాయగర్ ఆలయం హుండీలను బుధవారం దేవదాయ శాఖ తనిఖీదారుడు బి.వసంత కుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. 25 రోజులకు గాను రూ.17,03,494, 11 గ్రాముల బంగారం, 122 గ్రాముల వెండి, 61 యూఎస్ఏ డాలర్లు, 10 కెనడియన్ డాలర్లు, 1002 ఖతార్ రియాల్, 20 మలేషియా రింగిట్, 30 యెన్‌లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.పోళన్ తెలిపారు. శివజ్యోతి, శ్రీ వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు హుండీల లెక్కింపు చేపట్టారు. ఆలయ సిబ్బంది జి.గోవింద్ రెడ్డి, బి.జి.ఎస్ ప్రసాద్, ఈ.అప్పలరాజు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.